



విజయవాడలో అధికారులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

వరద సాయం వేగంగా

- అర్హుడైన ప్రతి వరద బాధితుడికి సహాయం అందాలి
- పరిహారం చెల్లింపులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భారీ వర్షాలు, వరద బాధితులకు ప్రభుత్వం ఇంత వేగంగా సాయం అందిస్తున్న సందర్భం గతంలో లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్యూమరేషన్‌కు సంబంధించి సచివాలయాల మ్యాపింగ్ పరిధిలో లేని వారు, ఇతర టెక్నికల్ సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్న 13 వేల అర్జీలను జిల్లా స్థాయిలో తక్షణం పరిష్కరించాలని, టైమ్ బౌండ్ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. వరద బాధితలకు పరిహారం చెల్లింపు కార్యక్రమాన్ని విజయవాడలోని ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో ప్రారంభించారు. అర్హుడైన ఏ ఒక్క వరద బాధితుడు కూడా నష్టపోకూడదని, వారికి ప్రభుత్వం ప్రకటించిన సాయం అందాల్సిందేనని చెప్పారు. ప్రభుత్వ సాయంగా బాధితుల ఖాతాలలో డబ్బులు పడిన తర్వాత వారికి డబ్బులు చెల్లించిన విషయాన్ని కూడా తెలియజేయాలని సూచించారు. ఒకవేళ సహాయం రాని వారికి ఎందుకు రాలేదో కూడా వారికి చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాగే సచివాలయాలలో జాబితాలు ప్రదర్శించాలని చెప్పారు.

చివరి నిమిషంలో సమస్యలపై అసహనం

వరద బాధితులకు సహాయం అందించే అంశాలకు సంబంధించి ప్రజాప్రతినిధులను కూడా ఫీడ్ బ్యాక్ ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దీనిపై రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఈ క్రాప్ అంశంపై మాట్లాడారు. ఈ క్రాప్ నమోదుకు సంబంధించి కౌలుదారుల డేటా ఎక్కలేదని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే దీనిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు స్పందిస్తూ 1,82,000 వరకు ఈ క్రాప్ బుకింగ్ చేయటం జరిగిందని, ఇందులో 40 శాతం మేర అంటే 76 వేల వరకు కౌలుదారుల డేటా ఎక్కించినట్లు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన సీఎం మాట్లాడుతూ.. వాళ్లు చేయగలిగింది చేశారని.. టైమ్‌బౌండ్ కార్యక్రమాన్ని పెట్టుకున్నపుడు చివరి నిమషంలో చెప్పటం సరికాదని, ముందే స్పందించాలని అన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూడా ఏదో చెప్పారు. ఆడియో వినపడలేదు. మొత్తం మీద ప్రజా ప్రతినిధులు ఆలస్యంగా స్పందించటం పట్ల చంద్రబాబు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

అన్నగా, తండ్రిగా ఆదుకున్నారు: సమీ ఉన్నీసా



ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు. వరదలో మేము పడిన కష్టం అంతా, ఇంతా కాదు. ఒక రోజు ఇబ్బందులు పడ్డాం. మరుసటి రోజు నుంచి మాకు అల్పాహారం, భోజనాలు, తాగునీరు సమకూర్చారు. వరద కారణంగా బట్టలు, దుప్పట్లు పాడైపోతే వాటిని కూడా మాకు ఇచ్చారు. కుటుంబ జీవనం కోసం రేషన్ సరుకులు ఇచ్చారు. మాది గ్రౌండ్ ఫ్లోర్ .. వరదనీటిలో మునగటంతో ప్రభుత్వం రూ. 25 వేల సహాయం చేయటం మా అదృష్టం. ఇంత పెద్ద సహాయం ఎప్పుడూ చేయలేదు.

కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాం : రఫీ

విజయవాడ ప్రజలు కోలుకుంటున్నారంటే అది మీ దయే. వరద బాధితులు నష్టపోకూడదన్న ఉద్దేశంతో మీరు ఇచ్చిన సాయం మరువలేనిది. మీరిచ్చిన సాయంతో మేము మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాం.

బదిలీల పరేషాన్

జిల్లాలో అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. మంత్రులు, శాసన సభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలను సైతం పక్కనపడేసి అధికారులను బదిలీ చేయడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టరేట్‌లో జోరుగా చర్చ నడుస్తోంది. డిప్యూటీ తహసీల్దార్, వివిధ హోదాల్లో ఉన్న కిందస్థాయి ఉద్యోగుల బదిలీల్లో కలెక్టర్‌దే తుది నిర్ణయమని ప్రచారం చేసిన కలెక్టరేట్‌లోని కొందరు అధికారులు తెరవెనుక మాత్రం ఇష్టానుసారంగా జాబితాలు తయారు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు జిల్లా అధికారుల బదిలీల్లో చిక్కుముడులు వీడటంలేదు. డీపీవో బదిలీ కాగానే అక్కడ పనిచేసే సూపరింటెండెంట్ విజయవాడకు, సీనియర్ అసిస్టెంట్ గుడివాడకు రాత్రికి రాత్రే బదిలీ చేయించుకుని వెళ్లడం గమనార్హం. -ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం



గ్రామ పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు పూర్తి స్థాయిలో జరిగాయి. అంతర జిల్లా, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల మధ్య జిల్లాయేతర బదిలీలు కూడా చేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 43 మంది బదిలీ అవ్వగా, వీరి స్థానంలో కొత్త వారిని నియమించారు. గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీలలో 23 మందిని, గ్రేడ్ - 2 కేటగిరిలో 10 మందిని, గ్రేడ్ - 3 కేటగిరిలో నలుగురు, గ్రేడ్ - 4 కేటగిరీలో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారు.

- డీఆర్‌డీఏ పీడీ పోస్టు కోసం పోటాపోటీ
- డ్వామా పీడీగా ఒకరికి మంత్రి సిపార్సులేఖ
- మరొకరికి పోస్టింగ్ ఇచ్చిన అధికారులు
- డీపీవో కార్యాలయ ఉద్యోగుల బదిలీల్లో విచిత్రాలు

పీడీగా ఎవరికి అవకాశం?

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)పీడీగా ఉయ్యూరు డీఎల్‌డీవోగా పనిచేస్తున్న నాంచారరావును నియమించాలని మంత్రి సిఫార్సులేఖను ఇచ్చారు. ఆయనే డీఆర్‌డీఏ పీడీగా వస్తారనే ప్రచారం కూడా సాగింది. అయితే ఈ అధికారిని నియమించారా లేదా అనేదానిపై స్పష్టత రాలేదు. డీపీవోగా పనిచేసిన నాగేశ్వరనాయక్ డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగాను కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో నాగేశ్వరనాయక్‌ను చిత్తూరు డీపీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. చిత్తూరు జిల్లాకు డీపీవోగా వెళ్లేందుకు సుముఖంగా లేని నాగేశ్వరనాయక్ తనను డీఆర్‌డీఏ పీడీగా నియమించాలని కోరుతూ జిల్లాకు చెందిన మంత్రులు, కలెక్టర్ చుట్టూ తిరుగుతున్నారు. డీఆర్‌డీఏ పీడీగా ఎవ్వరూ లేకపోవడంతో మూడు రోజుల క్రితం డీపీవోగా బాధ్యతలు చేపట్టిన జె.అరుణను ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరుగా డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న తోట సతీష్ కొద్దినెలలుగా పనిచేస్తున్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజరు కార్యాలయంలో అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తున్న డి.సృజనను ఇటీవల జరిగిన బదిలీల్లో సివిల్ సప్లయిస్ జిల్లా ఇన్‌చార్జి మేనేజరుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లాలో ఆమె భర్త పనిచేస్తుండటంతో స్పౌజ్ కేసుగా చూపి ఇన్‌చార్జి మేనేజరుగా నియమించడం గమనార్హం. ఆమెను ఈ పోస్టులో నియమించడానికి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్

'సివిల్ సప్లయిస్'పై స్పష్టత వచ్చేనా?

నాయకులకు కూడా తెలియకుండా ఇద్దరు రైస్‌మిల్లర్లు తెరవెనుక ప్రయత్నాలు చేశారని ఆశాఖ ఉద్యోగులు, మిల్లర్స్ అసోషియేషన్ ప్రతినిధులు చెప్పుకుంటున్నారు. దీంతో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ నాయకులు మంత్రి కొల్లు రవీంద్ర వద్దకు వెళ్లి సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు బదిలీని ఆపాలని కోరినట్లు సమాచారం.

డ్వామా పీడీ విషయంలో సందిగ్ధత

డ్వామా పీడీగా ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా పనిచేస్తున్న ఎస్.వి.శివప్రసాద్‌ను నియమించారు. అయితే జిల్లాకు చెందిన మంత్రి ఒకరు వేరే అధికారిని కృష్ణా డ్వామా పీడీగా నియమించాలని సిఫార్సు లేఖను ఇచ్చారు. మంత్రి ఇచ్చిన ఆ లేఖను పక్కన పెట్టారు. తాము సూచించిన అధికారిని డ్వామా పీడీగా నియమించకపోవడంతో మంత్రి కార్యాలయం నుంచి సంబంధిత అధికారిని జాయిన్ చేసుకోవద్దని చెప్పడంతో డ్వామా పీడీ చేరికపై సందిగ్ధత నెలకొంది.

వీఆర్వోల బదిలీల్లోనూ అంతే..

జిల్లాలోని వివిధ మండలాల్లో వీఆర్వోలను బదిలీ చేశారు. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో గ్రేడ్-1 వీఆర్వోలు 77 మందిని, గ్రేడ్-2 వీఆర్వోలు 62 మందిని బదిలీచేశారు. ఈ నెల 21వ తేదీన బదిలీలు చేసినట్లుగా ఉత్తర్వులలో చూపినా.. 24వ తేదీన ఈ జాబితాలను బయటకు వదిలారు. గ్రేడ్-2 వీఆర్వోలను గ్రేడ్-1 రెవెన్యూ గ్రామాలలో నియమించడంతో ఈ అంశంపై రెవెన్యూ విభాగం సిబ్బందిలో అలజడి రేగింది. బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెం వీఆర్వోను మార్చాలని కూటమి నాయకులు పట్టుబట్టారు. ఈ గ్రామంలో గ్రేడ్-1 వీఆర్వోను నియమించాల్సి ఉండగా, అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న గ్రేడ్-2 వీఆర్వోను బదిలీ చేయకుండా తెరవెనుక కలెక్టరేట్‌లో పనిచేసే కొందరు ఉద్యోగులు చక్రం తిప్పారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

'విజయ'దశమి బోనస్ విడుదల

హనుమాన్ జంక్షన్ రూరల్, సెప్టెంబరు 25 : వరద ముంపునకు గురై, విజయవాడలోని ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఆగిపోయినా వీరవల్లి ఫ్యాక్టరీ ద్వారా పాల ఉత్పత్తులను సకాలంలో వినియోగదారులకు అందజేసేందుకు కృషి చేసిన సిబ్బంది, సొసైటీ సభ్యులకు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ధన్యవాదాలు తెలిపారు. వీరవల్లి పాలఫ్యాక్టరీలో బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఉద్యోగులు, పాల సొసైటీలకు ఆయన విజయదశమి బోనస్ విడుదల చేశారు. విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు రూ.5.3 కోట్లు, పాలసేకరణ సహకరించిన సొసైటీలకు రూ.1.3 కోట్లు విడుదల చేశారు. విజయదశమి నాటికి విజయవాడలోని ఫ్యాక్టరీలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రారంభించి, వినియోదారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, తదితర డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైసీపీకి కొత్త సారథులు

- కృష్ణాకు పేర్ని నాని, ఎన్టీఆర్‌కు అవినాశ్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ కృష్ణా, ఎన్టీఆర్, జిల్లాల అధ్యక్షులను పార్టీ అధినేత జగన్ ఖరారు చేశారు. కృష్ణాజిల్లాకు పేర్ని నానీ, ఎన్టీఆర్ జిల్లాకు దేవినేని అవినాశ్‌ని అధ్యక్షులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం తాడేపల్లిలోని జగన్ నివాసంలో జరిగిన రెండు జిల్లాల సమావేశానికి పలువురు నాయకులు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలన్న దానిపై చర్చ జరిగింది. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి రాజగోపాల్, వాసిరెడ్డి పద్మ, వి.మనోహర్ ఈ రేసులో ఉన్నారు. ఏకాభిప్రాయం రాకపోవడంతో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుందామని వాయిదా వేశారు. సెంట్రల్ ఇన్‌చార్జిగా తిరిగి మల్లాది విష్ణుకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి వెలంపల్లి శ్రీనివాసరావు పోటీ చేశారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకంపై స్పష్టత ఇవ్వలేదు.

స్మార్ట్ మీటర్లలో మంటలు

వరదల్లో మునిగిన స్మార్ట్ మీటర్లు
లంకల్లో వ్యవసాయ మోటార్లకు 2,300 మీటర్ల బిగింపు
కరెంట్ ఉన్నా మోటార్లు పనిచేయక అన్నదాతల అవస్థలు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 25: కృష్ణానది వరదల అనంతరం లంకల్లో వ్యవసాయ మోటార్ల విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాక రైతులు మోటార్లను బాగు చేయించి స్విచ్ ఆన్ చేయగానే స్మార్ట్ మీటర్లలో మంటలు చెలరేగి కాలిపోతున్నాయి. గతేడాది లంకల్లో 2,300 స్మార్ట్ మీటర్లను వ్యవసాయ మోటార్లకు అనుసంధానిస్తూ స్తంభాలకు బిగించారు. వరదకు రైతుల మోటార్లు, స్టార్టర్ బోర్డులతో పాటు స్మార్ట్ మీటరు కూడా మునిగి ఒండ్రుమట్టి పేరుకుంది. అయితే రైతులు మోటార్లను, స్టార్టర్ బోర్డులను రూ.10 వేల ఖర్చుతో బాగచేయించుకుంటున్నారు. స్మార్ట్ మీటరును బాగుచేసే బాధ్యత సంబంధిత కాంట్రాక్టు సంస్థపై ఉంటుందని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. స్మార్ట్ మీటరు కాలిపోవటంతో విద్యుత్ కనెక్షన్ ఉండి కూడా మోటారును ఆడించ లేని పరిస్థితి ఎదురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపు, కంద తదితర పంటలను తొలగించి మినుము వేద్దామంటే అవకాశం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనిపై మండల విద్యుత్ ఏఈ దేవదాసును వివరణ కోరగా స్మార్ట్ మీటర్లను బిగించిన సంస్థ మళ్లీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు.



ఆన్‌చేయగానే కాలిపోయిన స్మార్ట్‌మీటరు



అమ్మ వారి లడ్డూ నాణ్యమేనా?

- ఫుడ్‌సేఫ్టీ తనిఖీల్లోనూ అదే పరిస్థితి

దుర్గమ్మ లడ్డూ ప్రసాదంపై భక్తులకు అనుమానాలు

- నాసిరకం సరుకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు
- 1,100 కిలోల కిస్‌మిస్, 700 కిలోల జీడిపప్పు తిరస్కరణ
- ప్యాకెట్లపై కనిపించని లేబుల్స్

తిరుమలలో లడ్డూ వివాదం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ లడ్డూ నాణ్యతపైనా అనుమానాలు కలుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం దుర్గగుడిలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల్లో నాసిరకం జీడిపప్పు, కిస్మిస్‌ను గుర్తించడం ఈ సందేహాలకు బలం చేకూరుస్తోంది. ప్యాకింగ్‌పై ఆ పదార్థం ఎప్పుడు తయారు చేశారు, ఎప్పుడు ప్యాకింగ్ చేశారు.. అనే వివరాలు లేవని అధికారులు తేల్చారు. ఈ ఘటనలన్నింటి నేపథ్యంలో దుర్గగుడి లడ్డూ ప్రసాద నాణ్యత భక్తులను కలవరానికి గురిచేస్తోంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): దుర్గగుడిలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే పదార్థాలను కాంట్రాక్ట్ పద్ధతిన కొంటారు. పులిహోర, పొంగలి, గారెలు, కట్టెపొంగలి, దద్దోజనం, లడ్డూ ప్రసాదాలను తయారు చేస్తారు. పులిహోర, పొంగలి, గారెలు, కట్టెపొంగలి, దద్దోజనం వంటివి మహామండపంలోని పోటులో తయారు చేస్తారు. లడ్డూ ప్రసాదాన్ని మాత్రం మహామండపానికి ఎదురుగా ఉండే కేంద్రంలో తయారు చేస్తారు. లడ్డూల తయారీని మాత్రం కాంట్రాక్టరుకు అప్పగించారు. వీటిలో ఉపయోగించే జీడిపప్పు, కిస్మిస్ సరఫరాను కాంట్రాక్టుకు ఇచ్చారు. లోగడ రెండేళ్లకోసారి టెండర్లను ఆహ్వానించేవారు. ఇప్పుడు ఆరు నెలలకోసారి పిలుస్తున్నారు.

జీడిపప్పు, కిస్మిస్ నాణ్యతకు తిలోదకాలు

దుర్గమ్మకు సమర్పించే గారె ప్రసాదంలో జీడిపప్పు, కిస్మిస్‌ను ఉపయోగించరు. పులిహోరలో జీడిపప్పును ఉపయోగిస్తారు, కిస్మిస్‌ను ఉపయోగించరు. మిగిలిన అన్ని ప్రసాదాల్లో తప్పనిసరిగా కిస్మిస్, జీడిపప్పు ఉంటాయి. తయారీకి ఉపయోగించే పాత్రలను బట్టి వాటిని వాడతారు. 50 పాత్రల్లో ప్రసాదాన్ని తయారు చేస్తే, అందులో 70 కిలోల జీడిపప్పు, 50 కిలోల కిస్మిస్‌ను ఉపయోగిస్తారు. ఇది నిత్యం జరిగే ప్రక్రియ. తిరుమల లడ్డూ తయారీలో కల్తీనెయ్యి ఉపయోగించారన్న ఆరోపణలు రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఇంద్రకీలాద్రిపై కొద్దిరోజుల క్రితం సోదాలు చేశారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే పదార్థాలను పరిశీలించారు. తయారీ కేంద్రంలోనూ తనిఖీలు నిర్వహించారు. ఇక్కడున్న జీడిపప్పు, కిస్మిస్‌ను పరిశీలించి నాణ్యత లేదని గుర్తించారు. ఈ జీడిపప్పు, కిస్మిస్ వాసన వచ్చినట్టుగా అధికారులు గుర్తించారు. 1,100 కిలోల కిస్మిస్, 700 కిలోల జీడిపప్పును తిరస్కరించారు. ఈ పదార్థాలను ప్రసాదాల తయారీలో వినియోగించవద్దని ఆదేశించి, సంబంధిత సరఫరాదారులకు వెనక్కి పంపేయాలని స్పష్టం చేశారు.

కాంట్రాక్టర్ల కనికట్టు

ప్రసాదాల తయారీకి వినియోగించే పదార్థాలు ముందుగా దేవస్థానం స్టోర్స్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి పోటు, లడ్డూ తయారీ కేంద్రానికి వెళ్తాయి. దుర్గగుడిలో రోజుకు 30 వేల నుంచి 40 వేల లడ్డూలు తయారు చేస్తారు. ఆది, శుక్రవారాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో 40 వేల నుంచి 50 వేల లడ్డూలు తయారు చేస్తారు. శరన్నవరాత్రుల్లో అయితే.. రోజుకు 2 లక్షల వరకూ తయారు చేస్తారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు ఆ తర్వాత ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ దర్శనానికి వస్తారు. తిరుమల మాదిరిగానే ఇక్కడి లడ్డూ, పులిహోర ప్రసాదాన్ని పవిత్రంగా స్వీకరిస్తారు. దుర్గగుడికి ప్రసాదాల తయారీలో వినియోగించే పదార్థాలను సరఫరా చేయడానికి కాంట్రాక్టర్లు ఎగబడతారు. టెండర్లను దక్కించుకోవడానికి అనేక పైరవీలు చేస్తారు. తీరా టెండరును దక్కించుకున్నాక నాసిరకం పదార్థాలను సరఫరా చేస్తున్నారు. అధికారులకు చూపించేటప్పుడు గ్రేడ్-1, ఆ తర్వాత తక్కువ గ్రేడ్ సరుకును ఇస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల్లో తీసుకున్న నమూనాలను హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పరీక్షల నిమిత్తం పంపారు. ఈ నివేదిక 15 రోజుల్లో వస్తుంది.

ప్యాకింగ్‌లో అవకతవకలు

సాధారణంగా ఒక వస్తువును ప్యాకింగ్ చేసినప్పుడు దానిపై ఆ బ్రాండ్‌కు సంబంధించిన లేబుల్స్ ఉంటాయి. ప్యాకింగ్ ఎప్పుడు చేశారు, ఎప్పటి వరకు నిల్వ ఉంటుంది, ఆ పదార్థం స్టాండర్డ్ ఏమిటి.. అనే వివరాలు ఈ లేబుల్స్‌పై ఉంటాయి. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తిప్పి పంపేసిన జీడిపప్పు, కిస్మిస్‌పై అలాంటి లేబుల్స్ లేవని గుర్తించారు. దీన్నిబట్టి సరఫరాదారులు నాసిరకం జీడిపప్పు, కిస్మిస్‌ను దేవస్థానానికి సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు.



దుర్గమ్మ ఆలయంలో లడ్డూ తయారీని తనిఖీ చేస్తున్న అధికారులు



దసరా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న సత్యనారాయణ

సామాన్య భక్తులకు ప్రాధాన్యం

» దసరా ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ సమీక్ష

వన్‌టౌన్, సెప్టెంబరు 25 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చేనెల 3వతేదీ నుంచి 12వతేదీ వరకు జరగనున్న దసరా ఉత్సవాలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ అమ్మవారి దర్శనం కల్పించటంలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ దుర్గగుడి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయ అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బందితో సమన్వయ సమావేశంలో దసరా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఘాట్ రోడ్డులోని రిటైనింగ్ వాల్ నిర్మాణం, క్యూల ఏర్పాట్లు, షామియానాల ఏర్పాట్లు, ఇంజనీరింగ్ పనుల ప్రగతి, దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, టిక్కెట్ స్కానింగ్ వీఐపీ, వీవీఐపీ దర్శనాలు, అమ్మవారి దర్శన సమయాలు, వృద్ధులు, దివ్యాంగులకు సదుపాయాలు, ఉభయదాతలకు వాహనాలు వంటి వాటిపై సమగ్ర వివరాలను సేకరించారు. విద్యుత్ దీపాల అలంకరణ పనులు, కేశఖండనశాలలో, స్నాన ఘాట్ల వద్ద ఏర్పాట్లు, అన్నదానం, ఉచిత ప్రసాద వితరణ, తదితరాల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవో రామారావు, ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, వైకుంఠరావు, లింగం రమాదేవి, డీఈలు, ఏఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్లు

సీఎం నిర్ణయమే శిరోధార్యం

» చంద్రబాబును కలిసేందుకు కృష్ణా మిల్క్ డైరెక్టర్ల నిర్ణయం

» వీరవల్లి ఫ్యాక్టరీలో సమావేశమైన పాలకవర్గ సభ్యులు

» చలసాని ఆంజనేయులు రాజీనామాపై చర్చ

హనుమాన్‌జంక్షన్ రూరల్, సెప్టెంబరు 25 : 'సీఎం చంద్రబాబును కలిసి గత ఐదేళ్లలో యూనియన్ పరంగా ఎదురైన ఇబ్బందులు.. వ్యతిరేక పరిస్థితుల్లోనూ యూనియన్ పరంగా చేసిన అభివృద్ధిని వివరిద్దాం. ఆ తర్వాత చైర్మన్ మార్పుపై సీఎం నిర్ణయం మేరకు నడుచుకుందాం' అని కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు నిర్ణయించారు. బుధవారం వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ పాల ఫ్యాక్టరీ)లో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు రాజీనామా వదంతులపై చర్చించారు. సమావేశానికి 14మంది పాలకవర్గసభ్యులకుగాను 11మంది హాజరయ్యారు. ఒకరు విదేశాల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన అమూల్ వంటి డెయిరీలను తట్టుకుని, ప్రభుత్వ ఒత్తిళ్లను అధిగమించి పాడిరైతు సంక్షేమమే లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేసిందని ఈ సందర్భంగా డైరెక్టర్లు గుర్తు చేశారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృష్ణా మిల్క్ యూనియన్ సాధించిన పురోగతిని వివరించాలని నిర్ణయించామని, చైర్మన్ మార్పుపై చంద్రబాబు నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పాలకవర్గ సభ్యులు స్పష్టం చేశారు.

కొడాలికి చెప్పు దెబ్బలు తప్పవు : వెనిగండ్ల

గుడివాడ : ఎన్నికల్లో ప్రజల ఛీత్కారాలతో ఘోర ఓటమితో పిచ్చి పట్టి పక్క రాష్ట్రంలో తలదాచుకుంటున్న నాని మతిభ్రమించి పిచ్చివాగుడు వాగుతున్నాడని, పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేసిన వారికి వత్తాసు పలుకుతూ మాట్లాడటం దారుణమని, నోరు అదుపులో పెట్టుకోకుంటే రాష్ట్ర ప్రజల చేతుల్లో చెప్పు దెబ్బలు తప్పవని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హితవు పలికారు. బుధవారం ప్రజావేదికలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 3 నెలలుగా ఎక్కడో దాక్కుని, నేడు తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రత్యక్షమయ్యాడన్నారు. గతంలో ఆంజనేయస్వామి విగ్రహం చేయి విరిగితే బొమ్మ విరిగితే ఏమవుతుందని ఎద్దేవా చేశాడన్నారు. రథం దగ్ధమైతే మరొకటి తయారు చేస్తామని పిచ్చి ప్రేలాపనలు పేలాడన్నారు. నేడు తిరుమల లడ్డూ అపవిత్రమైందని దేశప్రజలు బాధలో ఉన్నారని, అంతర్జాతీయ మీడియా సైతం స్పందించిందని, నాని మాత్రం మూర్ఖత్వంతో నోటికి వచ్చినట్టు వాగుతున్నాడన్నారు. చేతి నిండా తాళ్లు కట్టుకుని, జుట్టు పెంచుకుంటే వెంకన్న భక్తులైపోరని గుర్తు చేశారు. నలభైసార్లు గుండు కొట్టించుకున్నానని చెబుతున్న నానికి మరోసారి తిరుపతి వెళ్లే అవకాశం రాకపోవచ్చునన్నారు. సమావేశంలో రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

» మండలి బుద్ధ ప్రసాద్



స్వామివారి సేవలో బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో దేవాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సి ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రముఖ దేవాలయాల ప్రతిష్ఠ మసకబారిందన్నారు. అంతర్వేది, రామకుప్పం, సింహాచలం దేవాలయాల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి బయటపడిందన్నారు. ఆలయాలను ఆధ్యాత్మిక సౌరభాలుగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. తిరుమల లడ్డు ప్రసాదంలో నెయ్యి కల్తీకి నిరసనగా బుధవారం వేకనూరు గ్రామంలోని సంతాన వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జనసేన పార్టీ పిలుపు మేరకు బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులచే విశ్వక్సేన పూజ, సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోపిదేవి దేవస్థానం ప్రతిష్ఠ మసకబారేలా అనేక తప్పులు జరిగాయన్నారు. గత ఐదేళ్లలో దేవస్థానంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ముఖ్యమంత్రిని కలిసి ఏసీబీ విచారణ కోరతానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొలికపూడి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

» జర్నలిస్టు సంఘాల డిమాండ్

తిరువూరు : తన అక్రమాలపై వరుస కథనాలు వస్తున్నాయనే ఉక్రోషంతో జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా సభ్య సమాజం సిగ్గుపడేలా బూతులు తిట్టిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఏపీఎంపీఏ, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కొలికపూడి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తిరువూరులో జర్నలిస్టులు భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేస్తామని యూనియన్ నేతలు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్ చేస్తూ తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంపీఏ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు విజయ్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ వి.వెంకట్రావ్, సీపీఎం నాయకులు ఎస్.నాగేశ్వర రెడ్డి, ఎమ్.నాగేంద్ర ప్రసాద్, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

వరద తాకిడికి నేల వాలిన బొప్పాయి!

» వంద ఎకరాల్లో తోటలు నాశనం.. రూ 2 కోట్ల నష్టం

తోట్లవల్లూరు : మండలంలోని ఎనిమిది లంకల్లో కృష్ణానది వరద ముంపుకి గురైన బొప్పాయి తోటలు మొదళ్లు కుళ్లి నేల వాలిపోతున్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. లంకల్లో వంద ఎకరాల్లో బొప్పాయి తోటలు సాగయ్యాయి. ఒక్కో రైతు మూడెకరాల నుండి 50 సెంట్ల వరకు సాగు చేపట్టారు. ఎకరాకు రూ 1.50 లక్షల ఖర్చు చేశామని వల్లూరుపాలెం రైతు బడుగు తిరుమలరావు తెలిపారు. కౌలుతో కలుపుకుని ఎకరాకు రూ 1.90 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. ఇలా బొప్పాయి రైతులకు సుమారు రూ. 2 కోట్ల నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తోటల వద్దకు వ్యాపారులు వచ్చి బొప్పాయి కాయలను కొనుగోలు చేసేవారని, ఇపుడు పరిస్థితి తారుమారైందని రైతులు చెపుతున్నారు. పడిపోయిన తోటలను తొలగించి మరో పంట సాగు చేయక తప్పదని అంటున్నారు.



తోట్లవల్లూరు లంకలో పూర్తిగా నేలవాలిన బొప్పాయి తోట

ఆక్వా సాగు.. కలెక్టర్ పరిశీలన

» చినగొల్లపాలెంలో వనామీ హేచరీలపై ఆరా

కృత్తివెన్ను, సెప్టెంబరు 25: ఆక్వా సాగు పరిశీలించేందుకు బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మండలంలో పర్యటించారు. తొలుత చినగొల్లపాలెం గ్రామంలో వనామీ హెచరీలను పరిశీలించి, రొయ్య పిల్ల ఉత్పత్తి, పెంపకంపై నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గరిశపూడి గ్రామంలో వనామీ చెరువులను పరిశీలించి, రైతులతో సంభాషించారు. అనంతరం మిలేష్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీని పరిశీలించారు. ఇంతేరు



పెదలంక డ్రెయిన్‌లో తొట్టెల్లో చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

గ్రామంలో ఉన్న రొయ్యల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెదలంక డ్రెయిన్‌కు రెగ్యులేటర్ గేట్లను ఏర్పాటు చేయాలని మాజీ డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు రైతులతో కలిసి కలెక్టర్‌కు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

ప్రమాదం అంచున ప్రయాణం!



మండలంలో ఆక్వాసాగును పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ బాలాజీ పెదలంక డ్రెయిన్ తొట్టెల్లో చేపల పెంపకాన్ని పరిశీలించేందుకు పడవలో ప్రయాణించారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో కలెక్టర్ ప్రయాణం ప్రమాదకరంగా సాగింది. అధికారులు కనీస ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. లోతైన డ్రెయిన్, సముద్ర మొగ దగ్గరలో అత్యంత వడిగా ప్రమాదకరంగా ఉండే డ్రెయిన్‌లో కలెక్టర్ పడవపై ప్రయాణం చేయాల్సి ఉండగా, అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవటం విమర్శలకు దారితీసింది. సాధారణ పడవపై 20 నిమిషాల పాటు కలెక్టర్ ప్రమాదపు అంచున ప్రయాణం సాగించారు. కలెక్టర్ తన వెంట తెచ్చుకున్న లైఫ్‌జాకెట్‌ను ధరించారు. మిగిలిన ఏ ఒక్కరు లైఫ్ జాకెట్ లేకుండానే పడవలో వెళ్లారు. 20 నిమిషాల పాటు సాగిన పడవ ప్రయాణం అనంతరం అధికారులు సురక్షితంగా ఒడ్డుకు చేరటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కేసుల పరిష్కారంలో పురోగతి!

» నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు తగుచర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో స్నేహపూర్వక పోలీసింగ్ విధానాన్ని అవలంబించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో అన్నిప్రాంతాలలో శాంతి కమిటీలను ఏర్పాటుచేసి, ఎలాంటి అల్లర్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీపావళిని పురస్కరించుకుని అనధికారికంగా దీపావళి టపాసులు తయారుచేసే వారిపై, నిల్వఉంచే వారిపై నిఘా ఉంచాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

మహిళలు, చిన్నపిల్లలపై నేరాలకు పాల్పడితే వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి త్వరితగతిన విచారణ పూర్తిచేసి నిందితులను కోర్టులో హాజరు పరచాలన్నారు. దొంగతనాలు, హత్యానేరాల్లో నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా గంజాయి విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు జరగకుండా నైట్‌బీట్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని, నేరాలకు పాల్పడేవారి కదలికలపై నిరంతరనిఘా ఉంచాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలలో బారికేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రమాద హెచ్చరికలను తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవలకాలంలో సైబర్ నేరాలసంఖ్య అధికమైందని, వీటిని అదుపుచేసేందుకు, ఈ తరహాకేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేకటీమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సైబర్‌నేరాలకు సంబంధించిన విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సామాజికపరంగా, రాజకీయంగా సమస్యాత్మక గ్రామాలను అధికారులు తరచూ సందర్శించి, పరిస్థితులను అంచనావేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుండా విధులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లవారీగా నమోదైన కేసులు, దర్యాప్తు జరిగిన విధానం, చార్జీషీట్‌లు దాఖలు, కోర్టులో కేసులు ఏ దశలో ఉన్నాయి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

బదిలీలు మారిపోతున్నాయ్!

» ఆర్‌డబ్ల్యూఎస్‌లో పైసలు ఇచ్చిన వారికి ఆర్డర్లు

» ఈఎన్‌సీ కార్యాలయానికి రెండుజిల్లాల నుంచి క్యూ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగంలో ఇచ్చిన బదిలీలను మళ్లీ మార్చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో భారీ అవినీతికి పాల్పడిన అధికారులు కొందరు బదిలీలను మార్పించుకుంటున్నారు. గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో కొంతమంది అధికారుల చుట్టూ వీరు తిరుగుతున్నారు. బదిలీ ఆర్డర్స్ వచ్చినా అక్కడికి వెళ్లటానికి ఈ అధికారులు ససేమిరా అంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో కొందరు అవినీతి అధికారులు డబ్బులు తీసుకుని ఆర్డర్లు మార్చేస్తున్నారన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలువురు ఏఈలు ఈఎన్‌సీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈఎన్‌సీ సంజీవరెడ్డి దీనిపై సీరియస్‌గా దృష్టి సారించి విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యూనియన్ బ్యాంకు సిబ్బంది సమ్మె విరమణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 : యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావడంతో ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న సమ్మెను విరమించినట్టు సంఘ నేత డి.రాజేష్‌బాబు తెలిపారు. బుధవారం లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో రాజేష్‌బాబుతో పాటు బి. యోహాన్, వినిల్, వి.శ్రీనివాస్, దుర్గారావు, సలాం, వాణి తదితరులు పాల్గొన్నారు. 60 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు నిర్ధిష్టమైన హామీని బ్యాంకు అధికారులు ఇచ్చారని చీఫ్ లేబర్ కమిషనర్ అభ్యర్థన మేరకు సమ్మెకు దిగడం లేదని సంఘ నాయకులు తెలిపారు.

చిరు వ్యాపారులను ఆదుకోండి

» గృహాల్లో చిన్న కిరాణా షాపులు, బడ్డీకొట్లనూ గుర్తించి పరిహారం ఇప్పించండి

» సీఎం చంద్రబాబుకు ఎంపీ కేశినేని చిన్ని సూచన..



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, సెప్టెంబరు 25 : గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న చిన్న కిరాణా షాపులు, బడ్డీకొట్లకు ట్రేడ్, లేబర్, కమర్షియల్ లైసెన్స్‌లు లేని కారణంగా ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదని, వాటిని నమోదు చేసి పరిహారం ఇప్పించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయవాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు వరద బాధితులకు నష్టపరిహారాన్ని విడుదల చేశారు. ఎన్యూమరేషన్ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని ఎంపీలు, ఎమ్మెల్యేలను కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ శివనాథ్ ఫస్ట్‌ఫ్లోర్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న షాపుల వారికి లైసెన్స్‌లు లేని కారణంగా ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదన్నారు. వీరిని ఆదుకోవటానికి భౌతిక పరిశీలన చేసి సహాయం అందించాలన్నారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ శివనాథ్ విజ్ఞప్తిని పరిశీలించాల్సిందిగా కలెక్టర్ సృజనకు సూచించారు.

చిరు వ్యాపారస్తులకు బీమా కంపెనీ ద్వారా 30 శాతం అడ్వాన్స్

వరదల్లో నష్టపోయిన చిరువ్యాపారస్తులను ఆదుకునేందుకు ఎస్ఎంఈ కార్పొరేషన్ బీమా కంపెనీల ద్వారా 30శాతం నగదు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. వరద బాధితులను చంద్రబాబు అన్నివిధాలుగా ఆదుకునేందుకు బీమా కంపెనీలు, బ్యాంకుల అధికారులతో మాట్లాడుతున్నారన్నారు. ఈనెల 30లోగా బీమా క్లెయిమ్‌లు, బ్యాంకు రుణాల రీషెడ్యూల్ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. వరదల్లో 6వేల టీవీలు మరమ్మతుకు రాగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో 4,500 టీవీలను బాగుచేసినట్టు తెలిపారు. మరో 1500 టీవీలను వారం రోజుల్లో బాగుచేస్తామని ఎలక్ట్రానిక్ కంపెనీలు తెలిపాయన్నారు. ఆర్థిక సహాయం విడుదల చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

దసరా పనులు పూర్తిచేయండి

» మంత్రి కొల్లు రవీంద్ర

వన్‌టౌన్, సెప్టెంబరు 25: దసరా పనులు సకాలంలో పూర్తిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరిలు దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, అధికారులను ఆదేశించారు. బుధవారం దసరా ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సుజనా చౌదరి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ సహా అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీసు, అగ్నిమాపక, ఇతర శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



దసరా ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, దుర్గగుడి ఈవో

దుర్గమ్మ పంచహారతుల సేవలో కలెక్టర్ సృజన

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ పంచహారతుల సేవలో బుధవారం సాయంత్రం కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం అధికారులు ఆమెకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేయగా వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆమె కళావేదికపై జరుగుతున్న కూచిపూడి నృత్యప్రదర్శనను తిలకించి కళాకారులను అభినందించారు.

అలరించిన శైలశ్రీ బృందం.. ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

నగరానికి చెందిన గోనుగుంట శైలశ్రీ ఆధ్వర్యంలోని శ్రీనృత్యకళా నిలయం కళాకారుల బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. నాట్యాచారిణి శైలశ్రీ ఆధ్వర్యంలోని బృందం 13 కీర్తనలకు హావ, భావంగా చక్కటి ప్రదర్శన చేసి ఆహూతుల అభినందనలు అందుకున్నారు.



కూచిపూడి నృత్య కళాకారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



పోటాపోటీగా మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారిణులు

ఉత్కంఠగా మహిళల ఫుట్‌బాల్

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 25 : కానూరు 100 అడుగుల రోడ్డు సమీపంలో అనుమోలు ప్రభాకర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్ర సీనియర్ మహిళా ఫుట్‌బాల్ మ్యాచ్‌లు బుధవారం ఉత్కంఠగా సాగాయి. మ్యాచ్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ పరిశీలించారు. తొలుత జట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. సత్యసాయి జిల్లా, నంద్యాల జిల్లాపై 5-0తో, కర్నూలు.. నెల్లూరుపై 1-0 తేడాతో, తూర్పుగోదావరి.. నంద్యాలపై 2-0తో, నెల్లూరు.. ఎన్టీఆర్ జిల్లాపై 2-0తో, సత్యసాయి.. తూర్పుగోదావరిపై 1-0తో విజయభేరి మోగించాయి. కర్నూలు, ఎన్టీఆర్ జట్ల మధ్య చివరిమ్యాచ్ రద్దయింది. సెమీస్, ఫైనల్స్ గురువారం జరుగుతాయని, అనంతరం విజేతలకు ట్రోఫీల ప్రదానం ఉంటుందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, చక్రవర్తి తెలిపారు.

రేపట్నుంచి నుంచి లీగ్ మ్యాచ్‌లు

టోర్నీ ముగిశాక సత్తాచాటిన 96 మంది ప్లేయర్స్‌ను ఆరు క్లబ్‌లు విడిదీసి ఈనెల 27 నుంచి 29 వరకు వారి మధ్య లీగ్ మ్యాచ్‌లను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాసరావు తెలిపారు. వారిలో నుంచి 22మందితో సీనియర్ జట్టును ఎంపిక చేసి వారికి ఏలూరులో 10 రోజుల శిక్షణ శిబిరం నిర్వహించి, అనంతరం నోయిడాలో అక్టోబర్ 10నుంచి జరిగే జాతీయ చాంపియన్‌షిప్‌కు పంపుతామని తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీగా శ్రీనివాసరావు

» ఏసీగా శ్రీనివాసచౌదరి

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా టి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఎస్ఈబీ ప్రధాన కార్యాలయంలో పనిచేసి, ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు విజయవాడలో డీసీగా పోస్టింగ్ ఇచ్చారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా వై.శ్రీనివాస చౌదరిని నియమించారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఎస్ఈబీని రద్దు చేసి ఎక్సైజ్ శాఖలో విలీనం చేసిన తర్వాత రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలకు పూర్వం ఉన్నట్టుగానే ఒక డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ను నియమించారు. ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్‌జిల్లా, కృష్ణాజిల్లాకు కలిపి ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అసిస్టెంట్ కమిషనర్ ఉంటారు. ఈ ఇద్దరు అధికారులు విజయవాడ కేంద్రంగానే విధులు నిర్వర్తిస్తారు. విజయవాడలో డిస్టలరీస్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న జి.మునిస్వామిని అనంతపురం జిల్లా ఏసీగా బదిలీ చేశారు. విజయవాడలో ఏపీఎస్‌బీసీఎల్ జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బి.స్వాతిని విజయవాడ డిస్టలరీస్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. విజయవాడలోని ఏపీఎస్‌బీసీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాసరావును నెల్లూరు జిల్లా డీసీగా బదిలీ చేశారు. విజయవాడలో ఎస్ఈబీ డీసీగా పనిచేసి, వెయిటింగ్‌లో ఉన్న ఎం.శంకరయ్యను ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో డీపీఈవోగా ఉన్న బి.శ్రీనాథుడిని విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. పాడేరులో ఎస్ఈబీ ఈఎస్‌గా పనిచేసి వెయిటింగ్‌లో ఉన్న సిరిగినీడి శ్రీనివాసరావు ఎన్టీఆర్ జిల్లా డీపీఈవోగా నియమించారు. కృష్ణా జిల్లా డీపీఈవోగా ఉన్న ఎ.అవులయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. కృష్ణా జిల్లా ఎస్ఈబీ ఈఎస్‌గా పనిచేసి వెయిటింగ్‌లో ఉన్న జి.గంగాధరరావును జిల్లా డీపీఈవోగా నియమించారు.

కృష్ణాజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా గంగాధరరావు

మచిలీపట్నం(ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా మచిలీపట్నం ఎక్సైజ్ విభాగం సూపరింటెండెంట్‌గా జి.గంగాధరరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. గతంలో కృష్ణా ఎస్ఈబీ ఈఎస్‌గా పనిచేసిన ఆయన కొంతకాలంగా పోస్టింగ్‌కోసం ఎదురుచూస్తున్నారు. మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభాన్ బదిలీఅయ్యారు. ఆయనను సీఐడీ విభాగం డీఎస్పీగా బదిలీచేశారు.

న్యూస్ బాక్స్

సేవలు గుర్తించే పదవి

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 : ప్రజలకు చేసిన సేవలను గుర్తించి చంద్రబాబు తనకు ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారని కొనకళ్ల నారాయణ అన్నారు. బుధవారం కొనకళ్ల నారాయణను పలువురు నగర ప్రముఖులు శాలువాలతో సత్కరించారు. టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, బత్తిన దాసు, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మంగళగిరి టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

కొనకళ్లకు శుభాకాంక్షలు



ఆటోనగర్ : ఆర్టీసీ చైర్మన్, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణను తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు నాగేంద్ర కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నలు కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అప్స డెమొక్రటిక్ గుడివాడ డివిజన్

సీఎం సహాయనిధికి విరాళాలు..

గుడివాడ : వరద బాధితుల సహాయార్థం అప్స డెమొక్రటిక్ గుడివాడ డివిజన్ సభ్యులు చంద్రబాబుకు చెక్కు అందజేశారు. విద్యాలయ ఉన్నత పాఠశాల రూ.1.75లక్షలు, విద్యావికాస్ ఉన్నత పాఠశాల రూ.1,04,600, పామర్రు మండలం, జుజ్జవరం ఉషోదయ స్కూల్ రూ.2,87,786, పామర్రు ఏఎన్ఎం ఉన్నత పాఠశాల రూ.1,50,500, వికాస్ రెయిన్‌బో స్కూల్ గుడివాడ రూ.40వేలు, తక్షశిల పబ్లిక్ స్కూల్ రూ.20వేలు, రాఘవేంద్ర ఉన్నత పాఠశాల రూ.5వేలు, బడ్జెట్ స్కూల్స్ రూ.70వేలు అందజేశారు.



వరద బాధితుల సహాయార్థం చంద్రబాబుకు రూ.15,00,116ల చెక్కును సిటీ కేబుల్, సిటీ సిరి డిజిటల్ నెట్‌వర్క్ అసోసియేషన్ సభ్యుల తరఫున సిటీ సిరిమీడియా ఎండీ దండమూడి కృష్ణమోహన్, సిటీకేబుల్ ఎండీ కొల్లి నారాయణప్రసాద్‌లు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 25 : పేదల గృహ నిర్మాణ పథకంపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టే విధంగా గ్రామాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన పెంచాలని బాపులపాడు మండల ప్రత్యేకాధికారి ఎస్.శ్రీనివాసరావు గృహనిర్మాణ శాఖ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కార్యాలయంలో 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంపై ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు పాల్గొని గ్రామాల్లో గృహ నిర్మాణ పథకంపై విస్తృతంగా ప్రచారం జరపాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ జయరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ షకీల్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ 5 కార్యదర్శులు, హౌసింగ్ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలి



విద్యార్థులతో యలమంచిలి కిషోర్‌బాబు

కంకిపాడు, సెప్టెంబరు 25 : విద్యతోపాటు విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సును బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వం లభిస్తోం దన్నారు. ప్రతి రోజు విద్యార్థులు ఒక గంట క్రీడలతో పాటు యోగా కూడా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీర్తన ట్యుటోరియల్స్ అధినేత చంద్రశేఖర్ నాయుడు, షేక్ అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేవతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 25 : వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మినీ గోకులం పథకాన్ని అందిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రేవతి సూచించారు. కానుమోలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు మినీ గోకులం పథకంపై అవగాహన కల్పించారు. పాడిరైతులు పశువులకు షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం 90శాతం వరకూ సబ్సిడీ అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో భవాని, వీఏఎ శ్రావణి, వీఎఫ్ఎ పూర్ణిమ రైతులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో పెదపులిపాక ఎడ్లకు ప్రథమస్థానం



సత్తాచాటిన ఎడ్లతో యజమాని శ్రీధర్

పెనమలూరు, సెప్టెంబరు 25 : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో రాష్ట్రస్థాయిలో జరిగిన సీనియర్ ఎడ్ల బండలాగుడు పోటీల్లో పెదపులిపాక రైతు గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఛత్రపతి, భీముడు పేరుగల ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచినట్లు ఎడ్ల యజమాని తెలిపారు. విజేత ఎడ్లను, యజమాని శ్రీధర్‌ను గ్రామస్థులు, టీడీపీ నాయకులు దాసరి హరి నీడు, మునునూరి శ్రీనివాసరావు, మునునూరి శ్రీధర్, పోలవరపు కుమార్, అట్లూరి బుజ్జిబాబు, మునునూరి నిర్మల్, గుండిమెడ నాగమధు అభినందించారు.

దీనదయాళ్ సేవలు చిరస్మరణీయం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 25 : మానవులంతా ఒక్కటేనని చాటి చెప్పిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సమాజానికి అందించిన సేవలు నేటికీ చిరస్మరణీయమని స్థానిక ఆదిత్య బధిర విద్యాలయం ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ అన్నారు. మానవతా వాది దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, కృష్ణకుమారి, పద్మ, సుధాబాబు పాల్గొన్నారు.

● స్థానిక ఆశాజ్యోతి మానసిక దివ్యాంగులకు బుధవారం స్థానిక వ్యాపారి గొట్టం సత్యనారాయణ కుటుంబసభ్యులు అన్నదానం చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

సూరంపల్లి, ముస్తాబాదలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబరు 25 : రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా అడుగులు వేస్తూ సీఎం చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని సూరంపల్లి, ముస్తాబాద గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఉరకలెత్తిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు నిద్ర లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రతకల్పించారన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో వేల మందికి ఉపాధి కల్పించటం జరుగుతుందన్నారు. సర్పంచ్ ఈలప్రోలు వాసు, గండికోట సీతయ్య, బాణవతు నీలిమ, జాస్తి వెంకటేశ్వరరావు, గొట్టిపూళ్ల వీరబాబు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, చిక్కవరపు నాగమణి, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, దేవరపల్లి కోటేశ్వరరావు, గొట్టిపూళ్ల శ్రీనాథ్, మండవ అన్వేష్, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో సత్యకుమార్ పాల్గొన్నారు.

●ముస్తాబాదలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వేము రాధాకృష్ణ, టీడీపీ మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, పాలడుగు మల్లికార్జునరావు, మేడేపల్లి కాంతారావు, షేక్ అబుల్యాజ్, గుంటూరు ప్రసాద్, కంచర్ల మురళీ, మేడేపల్లి రమాదేవి, జనసేన నాయకురాలు సంధ్యా తదితరులు పాల్గొన్నారు.



సూరంపల్లిలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం శ్రీనగర్‌కాలనీలో



గన్నవరంలో స్టిక్కర్‌లు అందజేస్తున్న జాస్తి

రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో బుధవారం ఇంటింటికీ వెళ్లి 100 రోజుల కూటమి ప్రభుత్వ పాలన వివరించి స్టిక్కర్‌లను పంపిణీ చేశారు. టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, చిక్కవరపు నాగమణి, దేవినేని సులోచన, మద్దుకూరి విజయ్‌కుమార్, మండవ అన్వేష్, చీమలదండు రామకృష్ణ, అబుల్యాజ్ పాల్గొన్నారు.

ఆకునూరులో..

ఉయ్యూరు : పెన్షన్‌పెంపు, డీఎస్సీ నోటిఫికేషన్ ఇతర సంక్షేమ పథకాల అమలుతో పాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ద్వారా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో ఇది మంచి ప్రభుత్వమని ప్రజలతో కీర్తించబడుతుందని ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆకునూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్ర భుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తహసీల్దార్ సురేశ్‌కుమార్ వివరించారు. పార్టీ నాయకులు వి.వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, స్టాండ్లీ బాబు, వీఆర్వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆకునూరులో తహసీల్దార్ సురేశ్‌కుమార్, సర్పంచ్ వసంత్‌కుమార్

కేన్సర్ చిన్నారికి వైఎన్‌ఆర్ చారిటీస్ సాయం



చిన్నారి కీర్తన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

పెనమలూరు, సెప్టెంబరు 25 : బ్లడ్ కేన్సరుతో బాధపడుతున్న చిన్నారికి వైఎన్‌ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. విజయవాడ మధురానగర్‌లో నివాసముంటున్న చిన్నారి కీర్తన కొంత కాలంగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకొన్న సంస్థ చైర్మన్ యలమంచిలి జయప్రకాష్ బుధవారం తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనాచౌదరి నివాసంలో ఆయన చేతుల మీదుగా రూ. 50వేల చెక్కును చిన్నారికి అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు ఉన్నారు.

సీఏ విద్యార్థినికి మానవత సాయం

హనుమాన్‌జంక్షన్ : పేద విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బుధవారం మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన మందపాటి లక్ష్మీశరణ్య సీఏ ఫౌండేషన్ కోర్సు పూర్తి చేసి ఇంటర్‌లో చేరేందుకు అవసరమైన కోచింగ్ నిమిత్తం మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సభ్యులు రూ.25 వేలు ఉపకార వేతనం అందజేశారు. మానవత శాఖ నుంచి రూ10వేలు, మారుబోయిన కోటేశ్వరరావు రూ.10వేలు, సభ్యుడు జన్యావుల గాంధీ రూ.5వేలు కలిపి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు కూరెళ్ల సుబ్బాచారి, వేగిరెడి. సూర్యనారాయణ, జేవీవీ సత్యనారాయణ, తాడి రంగారావు, చెక్కా సుబ్బారావు, కొట్నాని రామచంద్రరావు, వీవీ చలం, కేవీ సుబ్బారావు అవిర్నేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

ఉయ్యూరు : ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడి కొంతకాలంగా నడువలేని స్థితిలో ఉన్న పులపర్తి అనంతలక్ష్మికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను ఆ సంస్థ ఉయ్యూరు అధ్యక్షుడు సాకి రాజేశ్, కొలసాని రవికుమార్, శివాలయం మాజీ ఛైర్మన్ చిందా కుటుంబరాజు ద్వారా బుధవారం అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు పారుపూడి శివకృష్ణ, సభ్యులు అనిల్‌కుమార్, పవన్ ఫణికుమార్, శ్రీకుమార్, నాగేశ్వరరావు, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో ఆరోగ్యకర పంటలు

జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి



మర్లపాలెంలో పొలం పిలుస్తోంది

ఆకునూరు(ఉయ్యూరు), సెప్టెంబరు 25 : వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి సూచించారు. ఆకునూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలని చెరుకు పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి సూచించారు. ఆత్మ పీడీ నరసింహారావు, డీడీఏ మనోహర్, ఏవో నిస్సీగ్రేస్, నాతదేవి, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గన్నవరం : సస్యరక్షణ చర్యలతో పంటలను లాభసాటిగా మలుచుకోవాలని ఏవో ఎన్ లక్ష్మీతేజస్వీ అన్నారు. మండలంలోని మర్లపాలెం, బుద్ధవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులు జాస్తి మురళీకృష్ణ, కంభంపాటి కృష్ణకిషోర్, బొప్పూడి ప్రవీణ్, కొసరాజు రాము, కంభంపాటి సాయి, ఆళ్ల మల్లేశ్వరరావు, నక్కా రామయ్య, వీఏఏలు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉంగుటూరు : ఎరువులు, పురుగుమందుల వాడకంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయం సాధించవచ్చని ఏవో వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



కొనకళ్లకు అభినందనలు తెలుపుతున్న పెనమలూరు, ఉయ్యూరు నాయకులు

సమర్థతకు చంద్రబాబు పెద్దపీట

పెనమలూరు, సెప్టెంబరు 25 : పార్టీకి దశాబ్దాలుగా సేవ చేస్తూ పార్టీయే శ్వాసగా బతుకుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు సమున్నత పదవిని కేటాయించినందుకు అధినేత చంద్రబాబుకు టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ చైర్మన్‌గా ఎంపికైన కొనకళ్ల నారాయణను మంగళవారం రాత్రి ఆయన నివాసంలో కలిసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ విధేయులకు చంద్రబాబు సరైన స్థానం కేటాయిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, ఇమాం తదితరులు ఉన్నారు.

కొనకళ్లకు దండమూడి అభినందన

ఉయ్యూరు : ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. చౌదరితో పాటు పలువురు తెలుగుయువత నాయకులు బుధవారం కొనకళ్లను ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 25 : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం బాపులపాడు పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలు మేరకు కళాభారతి కల్చరల్ సొసైటీ కళాకారులు వివిధ కళారూపాలతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సొసైటీ కళాకారులు తిరుపతిరావు, సుబ్బారావు పరిశుభ్రతపై జానపద పాటలు రూపంలో అవగాహన కల్పించారు. బాపులపాడుతో పాటు పలు గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు.

పురుషోత్తపట్నంలో..

గన్నవరం : మండలంలోని పురుషోత్తపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛత హీ సేవాపై కళాజాత బృందం బుధవారం అవగాహన కల్పించింది. ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త ప్లాస్టిక్ కవర్‌ల నిర్మూలన, పర్యావరణ కాలుష్య నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మొక్కలు పెంపకం, స్వచ్ఛ భారత్, ఘన వ్యర్థాల నిర్వాహణ కోసం చేయాల్సిన కార్యాకలపాలను తెలిపారు. ఓడీఎఫ్ ప్లస్‌గా గ్రామాలను తీర్చిదిద్దాలని కళాజాత, పాటలు, వీధి నాటికలు, కామెడి సన్నివేశాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిశుభ్రతపై విద్యార్థుల ర్యాలీ

ఉయ్యూరు : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ, పరిశుభ్ర తపై ఉయ్యూరులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శివనాథ్, కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె. శేఖర్‌బాబు, టి. నరసింహారావు, ఎండీ నూర్ పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి పోటీలకు వీరవల్లి విద్యార్థులు



ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన వీరవల్లి, ఆత్కూరు పాఠశాలల విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 25 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో వీరవల్లి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమని హెచ్‌ఎం నిర్మల అన్నారు. వీరవల్లి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

సెయింట్ ఆంథోనీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఉంగుటూరు : తేలప్రోలు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ మండలస్థాయి ఆటలపోటీల్లో ఆత్కూరు సెయింట్ ఆంథోనీస్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ క్రీడానైపుణ్యాలు ప్రదర్శించి విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కుసుమ్ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 20మంది విద్యార్థులు ఆయా ఆటల్లో తమ సత్తాచాటి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు చెక్కును అందజేస్తున్న విద్యార్థులు, యాజమాన్యం

వరద బాధితులకు విద్యార్థుల ఆర్థికసాయం

పెనమలూరు, సెప్టెంబరు 25 : ఉయ్యూరు విజయసాయి పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం బుధవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు రూ. 50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ యాజమాన్యాన్ని, విద్యార్థులను అభినందించారు.

మృతురాలి కుటుంబానికి..

విజయవాడ రూరల్ : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఓ మహిళ కుటుంబానికి విజయవాడ రూరల్ మండలం టీడీపీ నేతలు బుధవారం ఆర్థికసాయాన్ని అందజేశారు. స్థానిక కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న పొన్నూరు సుబ్బమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నేత వేములకొండ నాగరాజు మృతురాలి కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి రామోజీ, కొత్తపల్లి పూర్ణ, ఉప్పలపాటి వెంకట్రావు, తలగడదీవి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.









బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.555

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బుద్ధప్రసాద్ ధన్యవాదాలు

అవనిగడ్డ రూరల్: "ఇటీవల వరదలొచ్చినపుడు ఎదురుమొండి-గొల్లమంద కరకట్ట రోడ్డు సమస్యను కలెక్టర్ డీకే బాలాజీ, నేను పరిశీలించి, వీడియో తీయించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాం. సమస్యపై స్పందించిన ఆయన కరకట్ట రోడ్డు నిర్మాణానికి ఏఐఐబీ నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు" అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఎదురుమొండి-గొల్లమంద మార్గంలో బ్రహ్మయ్య గారి మూల వరకు రహదారి నిర్మాణానికి సవరణ ప్రతిపాదనను రూ.409.18 లక్షల నుంచి రూ.1,345 లక్షల వరకు పెంచి ఏఐఐబీ గ్రాంటు కింద పంపాలన్న సూచనను పీఆర్ ఇంజినీరింగ్ చీఫ్ ఈనెల 27లోపు అమలుచేస్తారని తెలిపారు. ఏటిమొగ నుంచి ఎదురుమొండి వరకు వంతె నిర్మాణం, ఆవశ్యకతను రోడ్లు, భవనాల శాఖకు తెలియ జేయాలని, తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరాలని డిప్యూటీ కార్యాలయం నిర్ణయించిందన్నారు.

ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వమిది

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


బిళ్లపాడులో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


గూడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పక్కన బూరగడ్డ వేదవ్యాస్

గుడివాడ రూరల్, సెప్టెంబరు 25: ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వమని ప్రజలందరూ అంటున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బిళ్లపాడులో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలోని సమస్యలపై గ్రామస్థులతో మాట్లాడారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో గుడివాడ ప్రాంతంలో వరదలు వస్తే ఎవరూ పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలో మన ప్రాంతంలో చరిత్ర చూడని వరదలు వస్తే నాయకులు, అధికారులు, ప్రజలు ముందుకు వచ్చి బాధితులకు సాయం అందించారన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, వాసే మురళి, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎండీవో ఏవీ రమణ పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన: కాగిత కృష్ణప్రసాద్

గూడూరు: రాష్ట్ర ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం గూడూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి మొదటి 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలతో అనిపించుకుంటోందన్నారు. మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, పోతన స్వామి, బూరగడ్డ కిషన్‌తేజ్ పాల్గొన్నారు.

బందరు, భోగిరెడ్డిపల్లి, ఎస్ఎన్ గొల్లపాలెంలో..

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం 9, 47 డివిజన్లలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, వంకా వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము పాల్గొన్నారు. భోగిరెడ్డిపల్లి, ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామాల్లో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్, వక్కపట్ల శ్రీను పాల్గొన్నారు. భోగిరెడ్డిపల్లిలో సామూహిక సీమంతం కార్యక్రమంలో కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్‌లు గర్భిణులకు వస్త్రాలు, చలిమిడి, పండ్లు అందజేశారు. తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం గ్రామాల్లో తెలుగురైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, కుంచే నాని, మీనవల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


లడ్డూ కల్తీకి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్న రాధా-రంగా మిత్రమండలి

లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం హేయం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25: తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి, అందులోనూ అవినీతికి పాల్పడటం హేయమైన చర్య అని, కారకులను కఠినంగా శిక్షించాలని రాధా రంగా మిత్ర మండలి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు డిమాండ్ చేశారు. బుధవారం కూనపరెడ్డి చారిటబుల్ ట్రస్టు కార్యాలయం వద్ద లంకిశెట్టి నీరజ, ధూళిపాళ శ్రీరామ చంద్రమూర్తి, హరికృష్ణ, విన్నకోట సుబ్బారావు, వన్నెంరెడ్డి ప్రసాద్, జరుగు వెంకట సుబ్బారావు, విన్నకోట సంధ్య తదితరులు లడ్డూ కల్తీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి: బ్రాహ్మణసేవా సంఘం

మచిలీపట్నం టౌన్: తిరుమల లడ్డూ తయారీలో జంతు కళేబరాల నుంచి వచ్చిన నూనెను వాడి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని బ్రాహ్మణ సేవా సంఘం మచిలీపట్నం ఉపాధ్యక్షుడు ఏఆర్కే మూర్తి అన్నారు. బుధవారం సంఘ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకున్న వారెందరో నామరూపాలు లేకుండా పోయారని సంఘ నాయకులు వింజమూరి శివరాం, మోపర్తి సుబ్రహ్మణ్యం, కందుకూరి సత్యనారాయణ శర్మ, పి.వి.ఫణికుమార్, వడ్లమన్నాటి మారుతీదివాకర్, కాశీపట్నపు రఘుశర్మ, జి.ఎస్.ఎస్. ఆర్.శర్మ ధ్వజమెత్తారు.


లడ్డూ అపవిత్రంపై పెదకళ్లేపల్లిలో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

వీహెచ్‌పీ నిరసన

మోపిదేవి: వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పెదకళ్లేపల్లిలో నిరసన తెలిపారు. ఓంకార పీఠాధిపతి విజయానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో హిందువులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దుర్గానాగేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివుడి విగ్రహం ఎదుట నిలబడి లడ్డూ కల్తీకి కారకులను కఠినంగా శిక్షించాలని నినదించారు. అరజా ఆశాదేవి, అరజా ఏడుకొండలు, బాదర్ల లోలాక్షుడు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో స్పేస్ ఆన్ వీల్స్


బస్‌లో రాకెట్ నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 25: ఇస్రో, విజ్ఞానభారతి ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని బుధవారం ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో నిర్వహించారు. గ్రామీణ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన, ఆసక్తి పెంపొందించేందుకు ఇస్రో ప్రయోగించిన అనేక శాటిలైట్స్, వాటి ఉపయోగాలు, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ నమూనాలను ఇస్రోకు చెందిన బస్‌లో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఎస్ఆర్‌జీఈసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 330 మంది ఏఏఎన్ఎం అండ్ వీవీ ఆర్ఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులు, ఎస్ఈఆర్ఎం హైస్కూల్ విద్యార్థులు 50 మంది ప్రదర్శనను తిలకించారు. హైస్కూల్ ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, ఎస్ఆర్‌జీఈసీ వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్ ఎంఆర్‌సీహెచ్ శాస్త్రి, హైస్కూల్ వైస్ ప్రిన్సిపాల్ జీఎం సత్తిబాబు, 2024 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మిద్దె శ్రీనివాసరావు, హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.4.43 లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న పామర్రు ప్రైవేట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్

పామర్రు, సెప్టెంబరు 25: వరద బాధితుల సహాయనిధికి పామర్రు పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, యాజమాన్యాలు సేకరించిన రూ.4,43,344 చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేసినట్లు పాఠశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు.

మర్యాదపూర్వకంగా..


బుద్ధప్రసాద్‌ను కలిసిన మోపిదేవి దేవస్థానం ఈవో శ్రీరామ వరప్రసాదరావు

అవనిగడ్డ: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరామ వరప్రసాదరావు బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాజకీయాలకతీతంగా ఆలయాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఈవోకు ఎమ్మెల్యే సూచించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్‌కుమార్-సంధ్యారాణి దంపతులు రూ.లక్ష విరాళంగా ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావుకు అందజేశారు. ఖమ్మానికి చెందిన వెంకట రాఘవేంద్ర మణికంఠ 210 గ్రాముల వెండి ఆభరణాలను ఈవోకు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నందిగామ సర్పంచ్‌గా బొడ్డు హరిబాబు

పెడన రూరల్: నందిగామ సర్పంచ్‌గా బొడ్డు హరిబాబును నియమిస్తూ కలెక్టర్ నుంచి ఎండీవో కార్యాలయానికి ఆదేశాలందాయి. ప్రస్తుత సర్పంచ్ బొడ్డు చినబాబు ఎన్నిక చెల్లదంటూ గతంలో హరిబాబు కోర్టును ఆశ్రయించారు. చినబాబు ఎన్నిక చెల్లదంటూ సర్పంచ్‌గా హరిబాబును నియమిస్తూ తీర్పు రావటంతో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. చినబాబు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని సర్పంచ్ బాధ్యతలు చేపట్టారు. స్టే గడువు ముగిసినందున తిరిగి సర్పంచ్‌గా తనకు అధికారం ఇప్పించాలని హరిబాబు డీపీవో కార్యాలయాన్ని కోరారు. దీంతో జిల్లా ఎన్నికల అధికారి నుంచి ఎండీవో కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయని వాటిని హరిబాబుకు కార్యదర్శి రత్నాకరరావు ద్వారా అందించామని ఎండీవో వి.రెడ్డయ్య తెలిపారు.

ఘనంగా ఫార్మాసిస్ట్ దినోత్సవం


ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 25: వీవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, అధ్యాపకులు డాక్టర్ ఎ.సాయిధాత్రి, డాక్టర్ టి.బాలకృష్ణను ఘనంగా సన్మానించారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ) గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరామమూర్తి విచ్చేసి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ప్రెసిడెంట్ శశికళ, కార్యదర్శి పెరుమాళ్లు, కోశాధికారి కల్యాణపు నవాబు, మాజీ లయన్స్ గవర్నర్ వైవీసీ ప్రసాద్, జంగం మోహనరావు, జాస్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, సూరపనేని పరంధామయ్య, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) గుడ్లవల్లేరు శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవీష, అధ్యాపకులు అమీనీబీ, టి.ప్రశాంతి, శ్రావణి, వినోద్ కుమారి, రజని పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల సేవలు నిరుపమానం

పామర్రు: రోగులకు ఫార్మాసిస్టులు అందిస్తున్న సేవలు నిరుపమానమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సీహెచ్‌సీ కేంద్రంలో నిర్వహించిన ఫార్మాసిస్ట్ దినోత్సవ కార్యక్రమంలో పలువురు ఫార్మాసిస్టులను ఆయన సత్కరించారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, లుక్కా నరేష్, పావని, వరప్రసాద్, రవిశంకర్, రాజేష్, పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేయండి

పెడన, సెప్టెంబరు 25: పెడనలో మహిళల కోసం చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని, తమ సహకారం అందిస్తామని చేనేత జౌళి శాఖ జిల్లా ఏడీ సీహెచ్ సాయిప్రసాద్‌ను ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు కట్టా హేమసుందరరావు, పిచ్చుక ఫణికుమార్, బళ్ల సాంబశివరావు కోరారు. బుధవారం ఏడీని వారు కలిశారు.

వృద్ధాశ్రమానికి 100 సిమెంటు బస్తాల వితరణ

చల్లపల్లి, సెప్టెంబరు 25: నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమం ఆవరణలో నూతన ఆశ్రమ భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన ఘంటా రామకృష్ణ- సత్యవాణి దంపతులు 100 సిమెంటు బస్తాలు వితరణగా అందచేశారు. స్థానికుడు దోనేపూడి రవిశంకర్ ద్వారా ఆశ్రమ నిర్వాహకుడు శీలం భాస్కరరావుకు సిమెంట్ అందించారు. దాతలకు భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు.

వరిలో నత్రజని అధిక వినియోగంతో నష్టాలు

కూచిపూడి, సెప్టెంబరు 25: నత్రజని ఎరువులను వరిలో తగు మోతాదులో వాడాలని, మోతాదు మించితే పురుగు ఉధృతి పెరిగి దిగుబడులు తగ్గుతాయని శాస్త్రవేత్త కె.లహరి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కూచిపూడిలో రైతులకు వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తలు బుధవారం అవగాహన కల్పించారు. ఘంటసాల వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో మినుము ఎల్‌బీజీ 932, ఎల్‌బీజీ 904, జీబీజీ 01 రకాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని లహరి సూచించారు. ఈ పంట నమోదు, ఈకేవైసీ ఈనెలాఖరులోగా నమోదు చేయించుకోవాలని మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల రైతులకు తెలిపారు. ఏవో శివప్రసాద్, పశువైద్యుడు కె.శ్రీనివాసరావు, వీఏఏ సోమేశ్వర్, సర్పంచ్ కె.విజయలక్ష్మి, అమర బాలేశ్వరరావు, వీరంకి తులసీదాస్, పామర్తి శివకుమార్, కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

బిళ్లపాడులో పొలం పిలుస్తోంది

గుడివాడ రూరల్: రైతుల వద్దకే అధికారులు, శాస్త్రవేత్తలు వచ్చి సమస్యలు పరిష్కరించటానికే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీఏ ఎస్.రమాదేవి తెలిపారు. బిళ్లపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏవో బి.అనంతలక్ష్మి, వాసే మురళి, కర్రే గిరి, అనూష పాల్గొన్నారు.

మేలైన విత్తనాల ఎంపికతో ఆశించిన దిగుబడులు

మోపిదేవి: మేలైన విత్తనాలను ఎంపిక చేసుకుంటే ఆశించిన దిగుబడులు సాధించగలమని ఏడీఏ జయప్రద తెలిపారు. పెదప్రోలులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో వరి పొలాలను ఆమె పరిశీలించారు. సర్పంచ్ పొలిమేట్ల ఏసుబాబు, ఏవో హెబ్సిబా రాణి పాల్గొన్నారు.

రేమాలవారిపాలెంలో..

నాగాయలంక: రేమాలవారిపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏవో హారిక పాల్గొని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను రైతులకు వివరించారు. కషాయాల తయారీని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు.

టిప్పర్‌ను ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పామర్రు, సెప్టెంబరు 25: ఆగి ఉన్న టిప్పర్‌ను గ్యాస్ సిలిండర్ల లారీ వెనక నుంచి ఢీకొన్న ఘటనలో లారీడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై పామర్రు పరిధిలో కొండిపర్రు అడ్డరోడ్డు వద్ద మంగళవారం అర్థరాత్రి ఈ ప్రమాదం జరిగింది. కొండపల్లి నుంచి గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వస్తున్న లారీ కొండిపర్రు అడ్డరోడ్డు వద్ద మరమ్మతుల నిమిత్తం ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. సిలిండర్ల లారీ డ్రైవర్ మానవత్ వెంకటేశ్వరరావు(52) తీవ్రంగా గాయపడ్డాడు. సిలిండర్ల లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఎస్సై అవినాష్ ఆధ్వర్యంలో పోలీసులు వెంకటేశ్వరరావును క్రేన్ సాయంతో బయటకు తీశారు. చికిత్స నిమిత్తం బందరు ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

మోపిదేవి, సెప్టెంబరు 25: మండలంలో నిర్మాణంలో ఉన్న గృహాలను వేగంగా పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి టి.విష్ణు, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, ఆయా శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి గృహనిర్మాణాలు మరింత వేగవంతమయ్యేలా చూడాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ ధర్మేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పెషలాఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ఘంటసాల: గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో డి.సుబ్బారావు సూచించారు. బుధవారం మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ సంస్థ ఏఈ సురేంద్రతో కలిసి మండల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. 13 సచివాలయాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించామని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పెడన, సెప్టెంబరు 25: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలందించారు. 17, 18 వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కమిషనర్ ఎం.గోపాలరావు, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, మెట్ల గోపీప్రసాద్, కోమట్ల సుమప్రియ పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య నియమాలు పాటించాలి

చల్లపల్లి, సెప్టెంబరు 25: తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి గర్భిణీ ఆరోగ్య సూత్రాలను పాటించాలని లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు సూచించారు. లక్ష్మీపురం సచివాలయం-2 లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమంతోపాటు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ, ఆదిలక్ష్మి, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు. పోషకాహారంతో తయారుచేసిన వంటకాలను అంగన్వాడీ కార్యకర్తలు ప్రదర్శించారు. లక్ష్మీపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

గుడివాడ: కైకాల కళామందిరంలో మెప్మా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ప్రత్యేక స్టాళ్లను మున్సిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందించే ఆహార పదార్థాలను రుచి చూశారు. సీఎంఎం సుజాత, మెప్మా, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గుడివాడ: కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తక్కువ చూపు, అంధత్వం ఉన్న విద్యార్థులకు సమగ్ర శిక్ష, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, జిల్లా అంధత్వ నివారణ సొసైటీల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లను ఉచితంగా అందించారు. శస్త్ర చికిత్సకు సిఫారసుచేశారు. జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ రాంబాబు, ఎంఎల్ఎస్ సుభాన్, ఏఎస్‌వో నగేష్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు రెబెకా సునందిని, స్మృతి చంద్రమన్న, జాన్ ప్రకాష్, జాషువా, ఆప్టమాలజిస్ట్ నాగజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

మచిలీపట్నం టౌన్: రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో కృష్ణాజిల్లా రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రి గౌతమి నేత్రాలయం వైద్య సిబ్బంది ఉచిత నేత్ర వైద్య సేవా శిబిరాన్ని నిర్వహించారు. కారుమూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి

గుడివాడ: జగన్నాథపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్ ఆధ్వర్యంలో బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంగడాల సతీష్, పల్లపోతు మురళి, మామిడాల వెంకటరమణ, రావూరి కోటేశ్వరరావు, చింతపల్లి రాంబాబు, తిరుపాల్‌గుప్తా పాల్గొన్నారు.


అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో నిలిచిన నీరు

భారీ వర్షం.. రహదారులు జలమయం

అవనిగడ్డ, సెప్టెంబరు 25: అవనిగడ్డలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. 48 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలిపురం కాలనీ, సుగాలి కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానాల్లో మోకాళ్లలోతు నీరు నిలిచింది.

అవనిగడ్డ రూరల్: రామచంద్రపురం ప్రధాన రహదారి జలమయంగా మారింది. అవనిగడ్డ నుంచి కోడూరు వెళ్లే ప్రధాన రహదారిలో పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయకపోవటంతో వర్షానికి రహదారిపై నీరుచేరింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.


కొనకళ్ల నారాయణరావును అభినందిస్తున్న బండి రామకృష్ణ, జనసేన నాయకులు


సత్కరిస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, టీడీపీ నాయకులు

కొనకళ్ల నారాయణకు అభినందన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25: ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా నియమితుడైన కొనకళ్ల నారాయణరావును బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఆ పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, గల్లా తిమోతి, కొట్టె వెంకట్రావు, వంపుగడల చౌదరి తదితరులు అభినందించి, సత్కరించారు.

పామర్రు: ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఆయన సోదరుడు బుల్లయ్యను నియోజకవర్గ టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అభినందించి, సత్కరించారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వల్లూరిపల్లి గణేష్, జి.లక్ష్మీదాస్, శ్రీనివాసరావు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25: సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ తక్షణమే అమలు చేయాలంటూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద థాలీ బజావో పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని, చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అకౌంట్‌లో వేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ పెడన ఇన్‌చార్జి శొంఠి నాగరాజు, అబ్దుల్ మతీన్, కోకా ఫణిభూషణ్, కొడమంచిలి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

